క్లుప్తంగా

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని 21వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ బుధవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.7.50 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కమిషనర్ శ్రీనివాసులు, వైస్ చైర్‌పర్సన్లు వరలక్ష్మి, పద్మలత, వార్డు కౌన్సిలర్ వాల్మీకి శివ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, 11వ వార్డు కౌన్సిలర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ముగ్గురికి తీవ్రగాయాలు

తాడిపత్రి అర్బన్: మద్యం మత్తులో ముగ్గురు ఘర్షణ పడగా అందరికీ తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. స్థానిక యల్లనూరు రోడ్డులోని వైన్ షాపు వద్ద మంగళవారం రాత్రి నరసింహనాయుడు, చంద్రశేఖర్, అశోక్ మద్యం సేవించారు. వీరి మధ్య చిన్నపాటి వివాదం తలెత్తింది. మాటామాటా పెరిగి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయ భూముల కౌలు వేలం



వేలంపాట నిర్వహిస్తున్న ఈఓ శోభ

యల్లనూరు: మండలంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, భోగేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు కోసం వెంకటరమణ స్వామి ఆలయంలో బుధవారం వేలం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామికి చెందిన 85 ఎకరాల భూమిని 14 మంది రైతులు రూ.1.90 లక్షలు, భోగేశ్వరస్వామి భూములను ముగ్గురు కలిసి(27 ఎకరాలు) రూ.1.09 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు దేవాదాయశాఖ ఈఓ శోభ తెలిపారు. కార్యక్రమంలో స్పెషలాఫీసరు దుర్గా ప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మానసిక వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పుష్పావతి

గుంతకల్లుటౌన్: పిల్లలకు పోషకాహారం అందించి వారికి మానసిక వికాసం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి భవాని తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ స్వీపర్స్‌కాలనీ అంగన్వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. పిల్లల ప్రవర్తన, వారి శారీరక, మానసిక వ్యక్తిత్వ వికాసంపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు వైఎస్సార్‌సంపూర్ణ పోషణ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


ఏపీపీగా 'బుసా' కొనసాగింపు



బుసా సుధీర్‌రెడ్డి

గుత్తి: గుత్తి ఏడీజే(6వ అదనపు జిల్లా కోర్టు) ఏపీపీగా బుసా సుదర్శన్ రెడ్డి(బుసా సుధీర్‌రెడ్డి)ని కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 2020 నుంచి ఈ హోదాలో ఉన్న ఆయనను తాజాగా జూన్ 2026 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బుసా రెండో సారి ఏపీపీగా నియమితులవడంతో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

సమయపాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

యాడికి: సమయపాలన పాటించాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం రాయలచెరువు నం:2 సచివాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సిబ్బందిపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. వలంటీర్లు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

శింగనమలను ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజకవర్గాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం రోటరీపురంలో ఎమ్మెల్యే రామాలయం నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగు సంప్రదాయాలను మరచి పోకూడదన్నారు. నియోజకవర్గంలోని జనచైతన్య నగర్, చెదుల్ల, బాట్లో కొత్తపల్లి, రోటరీపురంలో రామాలయాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. వీటి నిర్మాణానికి ప్రభుత్వ సహకారంతోపాటు తమ వంతుగా రూ.20 లక్షలకు పైగా సొంత డబ్బు ఇచ్చామన్నారు. చాలవేములలో సొంతంగా రామాలయం నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. శింగనమలలో రామాలయం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గుర్తు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్‌డీ దామోదరమ్మ, మండల స్పెషలాఫీసర్ శ్రీమన్నారాయణ, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ కామాక్షి, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, నాయకులు నాగ, నరేంద్రరెడ్డి, ఐకేపీ సీసీ శంకర్, కొండమ్మ, నాగరాజు, మల్లయ్య, గంగరాజు, బాలరాజు, నారాయణస్వామి, మల్లేశు కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నాలుగేళ్లలో నలభై ఏళ్ల అభివృద్ధి

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో నలభై ఏళ్లకు సరిపడా అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం వెన్నపూసపల్లిలో ఎమ్మెల్యే మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ భోగతి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. మహిళలు ఎమ్మెల్యేకు పూలమాలలు, పసుపు కుంకుమలు, హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం హయాంలో చిన్నపాటి అభివృద్ధి కూడా జరుగలేదని, పిచ్చి రాతలు, పిచ్చి మాటలతోనే సరిపెట్టుకున్నారన్నారు. పేదల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు తీసుకొచ్చి లక్షల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో నాయకులు హరిశ్చంద్రారెడ్డి, పార్థసారథిరెడ్డి, మహేశ్వరరెడ్డి, పెద్దిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జాఫర్, ఆంజనేయులు, యోగానంద రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన చౌడమ్మతల్లి విగ్రహం

యల్లనూరు: పాతపేటలోని పురాతన చౌడమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం బుధవారం నేలకొరిగింది. పాతపేట శివాలయం ముందు ఉన్న ధ్వజస్తంభం 4 రోజుల క్రితం నేలకొరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు చౌడమ్మ తల్లి విగ్రహం పడిపోవడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పెద్దపప్పూరు: మండల కేంద్రంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఆధార్ అప్డేట్ చేసుకోండి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో రైతు భరోసా రాని రైతులు ఆధార్ కార్డును బ్యాంకు ఖాతాకు లింక్ చేసుకోవాలని ఏఓ సోమశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఏఓ మాట్లాడుతూ మండలంలో 286 మంది రైతులకు ఆధార్ అప్డేట్ లేని కారణంగా రైతు భరోసా డబ్బు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదన్నారు. డబ్బు పడని రైతుల వివరాలు ఆయా ఆర్బీకేల్లోని నోటీస్ బోర్డులో ఉంచామన్నారు.

జగనన్నతో విద్యారంగంలో మార్పులు

బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం రోటరీపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉన్నత చదవులు అందించేలా సీఎం వైఎస్ జగనన్న ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నాడు- నేడు కింద ప్రవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేశారన్నారు. అమ్మఒడి ద్వారా ఏటా రూ.15 వేలు తల్లుల అకౌంట్లలోకి జమ చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులు చదువుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా నోటు, టెస్ట్ బుక్కులు, యూనిఫాం, బూట్లు, బ్యాగు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఎంఈఓ. గురుప్రసాద్, సర్పంచ్ మీనాక్షి, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత విద్యా వ్యవస్థ రూపురేఖలే మార్చారన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. హెచ్ఎం, సుజాతమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

నార్పల: స్థానిక కస్తూర్బా పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, సర్పంచు మన్నీల సుప్రియ బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ రామతులసి, ఎంపీటీసీ శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయించండి

సాక్షి ఎఫెక్ట్..

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ధర్మవరం రైల్వే గేట్ వద్ద మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు పనులను 15 రోజుల్లో పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ నెల 11న ''మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటుకు మోక్షమెప్పుడో?' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. బుధవారం ఆయన పబ్లిక్‌హెల్త్ డీఈ గురప్పయాదవ్, మున్సిపల్ డీఈ హేమచంద్ర, ఏఈ శ్రీకాంత్‌లతో కలిసి పైప్‌లైన్ ఏర్పాటు పనులను పరిశీలించారు. పైప్‌లైన్ ఏర్పాటులో జరుగుతున్న ఆలస్యంపై పీహెచ్ ఇంజినీరింగ్ అధికారులను ఆరా తీశారు. రైలుమార్గం కింది భాగాన 23 మీటర్ల మేర పైప్‌లైన్ వేయాల్సి ఉండగా బండరాయి పడటంతో ఆ రాయిని తొలగించడానికి కొంత ఆలస్యమవుతోందని పీహెచ్ అధికారులు తెలిపారు. రాత్రింబవళ్లు పనులు చేయించి పూర్తి చేయాలని కమిషనర్ వారిని ఆదేశించారు.



పైప్‌లైన్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

రక్తదానం ప్రాణదానంతో సమానం

గుంతకల్లు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌సీసీ బృందం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్తదానానికి ముందుకు రావాలన్నారు. ఎన్‌సీసీ అసోసియేట్ లెఫ్టినెంట్ జీ.ప్రకాష్ రక్తదానంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్స్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ బసెట్టి క్రిష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డులోని సేవా బ్లడ్ బ్యాంకు కార్యాలయంలో బుధవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 42 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలోమాస్ ఎడ్యుకేషన్, ఆర్గనైజేషన్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలకు అనుమతులు తప్పనిసరి

గుత్తి రూరల్: నర్సరీలు ఏర్పాటు చేసే వారు తప్పకుండా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అనంతపురం ఏడీ హెచ్ నర్సింహారావు, టెక్నికల్ హెచ్ఓ రత్నకుమార్ సూచించారు. బుధవారం కొత్తపేట వద్ద ఉన్న నర్సరీలను గుత్తి హెచ్ఓ మిత్రవిందమాధవితో కలిసి వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సరీలు ఏర్పాటు చేసిన వారు తప్పకుండా ప్రభుత్వం నుంచి లైసెన్స్ తీసుకొని నాణ్యమైన మొక్కలను రైతులకు సరఫరా చేయాలన్నారు. నర్సరీలలో ప్రభుత్వం నిర్దేశించిన ధరకే మిరప, వంగ, బెండ, బంతిపూలు, టమాట మొక్కలను అందించాలన్నారు. అధిక ధరలకు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మొక్కలు తీసుకున్న ప్రతి రైతుకు తప్పకుండా రసీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ మేరి, వీఏఏ అజయ్, నర్సరీల యజమానులు పాల్గొన్నారు.

శింగనమల: నర్సీల ద్వారా రైతులకు నాణ్యమైన నారును విక్రయించాలని ఉద్యాన అధికారి శైలజ తెలిపారు. బుధవారం మండలంలోని నాయనపల్లి క్రాస్‌లో ఉన్న నర్సీరీలను తనిఖీ చేశారు. ప్రతి నర్సరీ యాజమాని నారు వివరాలు, అమ్మిన రైతుల జాబితా, నారు రకాలు, వాటి ధరలు వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. నాసిరకం నారును రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఉద్యాన సిబ్బంది భార్గవి ఉన్నారు.

నీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించండి

శింగనమల: నియోజకవర్గంలోని 50 మైనర్ ఇరిగేషన్ చెరువులకు నీటి సరఫరాపై ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మైనర్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. బుధవారం ఎస్ఆర్‌ఐటీలో మైనర్ ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని చెరువులపై మైనర్ ఇరిగేషన్ అధికారులు పూర్తి వివరాలు అందించడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న దృష్టికి తీసుకెళ్లి నీటి కేటాయింపులు చేయించామన్నారు. కేటాయించిన నీటిని ఎలా చెరువులకు తీసుకురావాలి, కాలువల పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కాలువలపై ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. అవసరమైన చోట కాలువలు ఏర్పాటు చేద్దామని తెలిపారు. ఎన్నికల లోపే కాలువలు సిద్ధం చేద్దామన్నారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఇన్ని చెరువులకు ఒకే సారి నీటి కేటాయింపులు జరగడం ఇదే తొలిసారన్నారు. త్వరలోనే ప్రణాళిక తయారు చేసి అందిస్తామని తెలిపారు. ఈఈలు ప్రతాప్, నారాయణ నాయక్, డీఈలు రాజ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోండి



దేవరపల్లిలో రైతులకు విత్తన పంపిణీ చేస్తున్న ఏఓ డీ లీనావసుంధర

పామిడి: రైతుభరోసా కేంద్రాల్లో రాయితీ వేరుశనగ విత్తనాలు, ఎరువుల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ డీ లీనా వసుంధర సూచించారు. బుధవారం మండలంలోని దేవరపల్లి, ఖాదర్‌పేట, అనుంపల్లి, రామగిరి, ఎద్దులపల్లి, వంకరాజుకాలువ ఆర్బీకేలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్బీకేల్లో యూరియా 89, డీఏపీ-72, ఎన్‌పీకే కాంప్లెక్స్-24 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలవ్యాప్తంగా 1,004 మంది రైతులకు 880.20 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేశామన్నారు. కౌలురైతులు కార్డుల కోసం నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందించిన మానవతామూర్తులు



జ్యోతికి ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

గుత్తి: గుంతకల్లుకు చెందిన ఓ మహిళకు కిడ్నీలు పాడయ్యాయి. ఆపరేషన్‌కు అవసరమైన డబ్బు లేక ఆమె ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న పలువురు మానవతామూర్తులు ఆమెకు ఆపన్నహస్తం అందించారు. వివరాల్లోకి వెళితే.. గుత్తికి చెందిన ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్ సోదరి జ్యోతి గుంతకల్లులోని విద్యా నగర్‌లో నివాసముంటోంది. భర్త ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జ్యోతికి ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో జ్యోతికి గుండె ఆపరేషన్ జరిగింది. ఉన్న డబ్బంతా ఆపరేషన్‌కు ఖర్చు అయింది. ఈ నేపథ్యంలో జ్యోతి రెండు కిడ్నీలు పాడయ్యాయి. వైద్యం కోసం డబ్బు అవసరమైంది. సమాచారం తెలుసుకున్న తాడిపత్రికి చెందిన రాజారామ్ గ్రానైట్ యజమాని దివాకర్ రూ.10 వేలు, గుత్తికి చెందిన అకౌంటెంట్ రాఘవేంద్ర(చిన్ని) రూ.5 వేలు, అల్లా బకాష్, జెమిని సురేష్, వెంకటేష్, నాగేంద్ర ప్రసాద్, రామాంజనేయులు తదితరులు తమకు తోచినవిధంగా ఆర్థికసాయం చేశారు.

శిశువు ఎక్కడ?

పెద్దవడుగూరు: మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ ఇటీవల శిశువుకు జన్మనిచ్చింది. అయితే ఆ చిన్నారి ప్రస్తుతం తల్లి వద్ద లేకపోవడం మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లో కెళితే.. మండల కేంద్రంలోని మెయిన్ బజారులో నివాసం ఉంటున్న ఓ మహిళ ఈ నెల 7న స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారికి జన్మనిచ్చింది. అయితే ఆ సమయంలో చిన్నారి ఆరోగ్యం బాగానే ఉందని ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత రెండు రోజులకు ఆ చిన్నారి మృతి చెందిందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు తల్లి వికలాంగురాలు కావడంతో పోషించుకోవడానికి ఇబ్బందిగా ఉందని భావించి శిశువును వేరొకరికి విక్రయించినట్లు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న ఆరోగ్య సిబ్బంది బాలింత నివాసం ఉంటున్న ఇంటి వద్దకు వెళితే ఇంటికి తాళం వేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమె తాను ఉంటున్న ఇంటిని ఖాళీ చేసి మండల కేంద్రంలోనే వేరే ఇంటికి మారినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా శిశువు ఎక్కడుందనే విషయాన్ని సంబంధిత అధికారులు కనుగొనాలని స్థానికులు కోరుతున్నారు.

ఏపీ ఈఏపీసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



జయవర్ధన్



కాశిరెడ్డి పవన్‌నాథరెడ్డి



హిరణ్మయి

తాడిపత్రి టౌన్: ఏపీ ఈఏపీసెట్ ఫలితాలను బుధవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేశారు. ఈ ఫలితాల్లో తాడిపత్రికి చెందిన పలువురు విద్యార్థులు అత్యంత ప్రతిభ చాటి ర్యాంకులు సాధించారు. పట్టణంలోని గాజుల క్రిష్ణప్పవీధికి చెందిన పొన్నతోట ప్రమోద్‌కుమార్ 28 స్టేట్ ర్యాంకు, సంజీవనగర్‌కు చెందిన జయవర్ధన్ 198వ ర్యాంకు సాధించారు. పట్టణానికి చెందిన రంగ సర్వేష్ 74 మార్కులతో 5665 ర్యాంకు, కె.పి విష్ణుసాయివర్ధన్ 63 మార్కులతో 10,899 ర్యాంకు , మహీధర్‌రెడ్డి 63 మార్కులతో 12,848 ర్యాంకు, రఘు వెంకటరెడ్డి 58 మార్కులతో 20,125వ ర్యాంకు, లోకేశ్వరరెడ్డి 57 మార్కులతో 21,269 స్టేట్ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఇదిలా ఉండగా రెడ్డివారి పాలెంకు చెందిన కాశిరెడ్డి పవన్‌నాథరెడ్డి నీట్‌లో 673/720 మార్కులతో జాతీయ స్థాయిలో 2414వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు.

గుంతకల్లుటౌన్: స్థానిక రాజేంద్రప్రసాద్ మున్సిపల్ స్కూల్ ఉపాధ్యాయుడు శంకర శాస్త్రీ కుమార్తె వై.హిరణ్మయి నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచింది. 720 మార్కులకు గానూ 665 మార్కులు సాధించి జాతీయస్థాయిలో 3,851వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 1,294వ ర్యాంకు సాధించింది. తెలంగాణ ఎంసెట్‌లో 197వ ర్యాంకు, ఏపీఈఏపీ సెట్‌లోనూ 127వ ర్యాంకును కైవసం చేసుకుంది.

అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, గడప గడపకూ మన ప్రభుత్వం కింద పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ల చేత త్వరితగతిన పూర్తి చేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ వి.మల్లికార్జున ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. బుధవారం చైర్‌పర్సన్ తన ఛాంబర్‌లో ఇంజినీరింగ్ విభాగపు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పూర్తి చేసి సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ అయిన బిల్లులన్నింటినీ ప్రభుత్వం చెల్లించిందన్నారు. పనులు పూర్తయి సీఎంఎఫ్ఎస్‌లో నమోదు కాని బిల్లులను కూడా వెంటనే అప్‌లోడ్ చేయించాలని తెలిపారు. ప్రస్తుతం సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్ వద్ద ఫిల్టర్‌బెడ్స్ మార్పు, తదితర మరమ్మతుల కారణంగా నాలుగైదు రోజుల పాటు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడనున్నాయని, వారంరోజుల నీటి సరఫరా కోసం అదనంగా ట్యాంకర్లను ఏర్పాటు చేయించాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యలు, పైప్‌లైన్‌ల లీకేజీలపై వెంటనే స్పందించాలన్నారు. మున్సిపల్ ఇంజినీర్ ఈశ్వరయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, డీఈలు హేమచంద్ర, వేణుగోపాల్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ భవాని

చిన్నారులను అంగన్‌వాడీ స్కూళ్లలో చేర్పించండి

గుత్తి రూరల్: తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ స్కూళ్లలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రియాంక కోరారు. బుధవారం బేతాపల్లిలో ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల తల్లులతో సమూహం ఏర్పాటు చేసి ప్రతి రోజు అంగన్‌వాడీ స్కూళ్లలో చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, లలిత, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

టి.కొత్తపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

గుత్తి రూరల్: టి.కొత్తపల్లి గ్రామంలో స్థలం విషయంలో బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రంగస్వామి, నారాయణస్వామి, రామ్మోహన్ స్థలం పక్కపక్కనే ఉన్నాయి. అయితే స్థల విషయంలో గతంలో అనేక సార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో బుధవారం మరోసారి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగి రంగస్వామి గాయపడ్డాడు. అతడిని వెంటనే కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

గుంతకల్లు రూరల్: గుంతకల్లు-గుత్తి జాతీయ రహదారిపై పాతకొత్త చెరువు వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. తాడిపత్రిలోని శివనగర్‌కు చెందిన ఖాజా, భాషా, నవీన్ బైక్‌పై మంగళవారం ఎల్లార్తికి వెళ్లారు. బుధవారం తిరిగి వస్తుండగా గుంతకల్లు మండలం పాతకొత్తచెరువు వద్ద వారి బైకు అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో ఖాజా నవీన్, బాషాకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఖాజా పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

గార్లదిన్నె: జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి ఉపాధి హామీ ద్వారా పనులు కల్పిస్తామని ఎంపీ డీఓ తేజోత్స్న పేర్కొన్నారు. బుధవారం మర్తాడులో ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఉపాధి కూలీల మస్టర్లు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మస్టర్లో పేర్లు ఉన్నవారు మాత్రమే పనులకు వెళ్లాలన్నారు. ప్రతి కూలీకి రూ.272 వేతనం వచ్చేలా పని చేయాలన్నారు. అనంతరం ఆమె మండల పరిషత్‌కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ కింద నాణ్యమైన పనులు చేయించాలన్నారు. ఏపీఓ నాంచారమ్మ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

రీ సర్వేతో శాశ్వత పరిష్కారం

యాడికి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష కార్యక్రమం ద్వారా చేపట్టనున్న రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా సర్వేయర్ శ్రీరాం ప్రసాద్ అన్నారు. బుధవారం రాయల చెరువు, తిమ్మాపురంలో రీ సర్వే పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేపై రైతులకు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. రీసర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సుబ్రమణ్యం, డీటీ రాజ్ కుమార్, మండల సర్వేయర్ సుంకన్న పాల్గొన్నారు.

హిజ్రాల నిరసన ర్యాలీ

నార్పల: మండల కేంద్రంలో హిజ్రాలు బుధవారం ధర్నా చేశారు. వివరాల్లోకెళ్తే.. హిజ్రాలకు చెందిన రెండు గ్రూపుల మధ్య జరిగిన వివాదంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అయితే అక్కడ ఒక గ్రూపునకు మాత్రమే న్యాయం చేశారని తమకు అన్యాయం జరిగిందని మరో గ్రూపు పోలీస్‌స్టేషన్ నుంచి గాంధీ సర్కిల్ వరకు నగ్నంగా ర్యాలీ చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సమస్య పరిష్కరమిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఘర్షణలో గాయపడిన వివాహిత మృతి

గార్లదిన్నె: ఘర్షణలో గాయపడిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి శ్రీనివాసులు, ఆయన కుమారుడు రామ్మూర్తి కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో శ్రీనివాసుల భార్య లక్ష్మీదేవి(60) అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దీంతో ఆమెను పక్కకు నెట్టేయడంతో కిందపడింది. ఘటనలో ఎడమచేతికి తీవ్ర గాయమైంది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న సీఐ అస్రార్ బాషా, ఎస్ఐ సాగర్ కల్లూరుకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

లారీ పట్టివేత

యాడికి: అధిక టన్నేజితో పోతున్న లారీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రామాంజులరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పేరుసోమల నుంచి నాపరాళ్ల లోడుతో బళ్లారికి పోతున్న లారీ మండలంలోని రాయచెరువు చెక్ పోస్టు వద్ద పట్టుకున్నామన్నారు.